1 St Year
Happy Work Anniversary.

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 161
గురువారం 18 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN



## గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రానికి అంధకారమే: మంత్రి అచ్చెన్నాయుడు

గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తుందన్న అచ్చెన్నాయుడు

డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు సవాల్ విసిరిన మంత్రి

వెన్నుపోటు అనే పదానికి జగనే పేటెంట్ తీసుకున్నారని ఎద్దేవా

ఇకపై జగన్ ప్రతి అబద్ధాన్ని ఆధారాలతో తిప్పికొడతామని స్పష్టీకరణ

మంత్రి అనితను ఎదుర్కోలేకే వైసీపీ నీచ రాజకీయాలని విమర్శ

2



## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ: ట్రంప్ కీలక హామీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 17)

భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీభారత్‌పై దాడి జరిగితే అమెరికా మిగతా 2లో

# ఎల్‌నినో ప్రభావం..

## పంటల మార్పిడిపై సీఎం చంద్రబాబు దృష్టి



పంటల మార్పిడి అవకాశాలను పరిశీలించాలని సూచన

ప్రకృతి సేద్యం వైపు రైతులను ప్రోత్సహించాలని ఆదేశం

పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై సమావేశాలకు నిర్దేశం

కష్టకాలంలో రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానవనం, ఆక్వా రంగాలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, పంట మార్పిడి దిశగా రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులను పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా, ఈ అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాల్లో మిగతా 2లో



## ఓటమి నాలో కసి పెంచింది.. మంగళగిరి అభివృద్ధిపై లోకేష్ భావోద్వేగం

మంగళగిరిని రాష్ట్రంలోనే నెం.1గా తీర్చిదిద్దుతానన్న లోకేష్

జగన్ బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయని చురక

జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని వ్యాఖ్య

కావాలనే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆరోపణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత నియోజకవర్గమైన మంగళగిరిని అన్ని రంగాల్లో నెం.1గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, గెలిచిన మొదటి రోజు నుంచే మిగతా 2లో

## ఎస్సీలంటే జగన్‌కు మొదటి నుంచీ చులకన భావమే మంత్రి డీఎస్‌బీవీ స్వామి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)

రాష్ట్ర హోంమంత్రి అనితపై వైకాపా నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మంత్రి డీఎస్‌బీవీ స్వామి అన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని మందలించాల్సింది పోయి సమర్థించడం జగన్‌కే చెల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎస్సీలంటే జగన్‌కు మొదటి నుంచీ చులకన భావమే. ప్రజలు బుద్ధి చెప్పినా ఆయన పెత్తందారీ పోకడలు మారలేదు. వైకాపా నేతలు సంస్కారహీనంగా మాట్లాడితే ఉపేక్షించేది లేదు" అని డీఎస్‌బీవీ స్వామి అన్నారు.

బహిరంగ క్షమాపణలు చెప్పాలి: ప్రత్తిపాటి పుల్లారావు

మంత్రి అనితపై గుడివాడ అమర్నాథ్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆ వ్యాఖ్యలను అమర్నాథ్ సమర్థించుకోవడం వైకాపా విష సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. దళితులను అవమానించే వక్రబుద్ధిని ఆ పార్టీ నేతలు మానుకోవాలన్నారు. అనితకు అమర్నాథ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు



## వైకాపా నేతలు ఎంత దూషించినా.. ఆమె గొంతు నొక్కలేరు: లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)

హోంమంత్రి అనితపై చేసిన అవమానకరమైన, మహిళా ద్వేషపూరిత వ్యాఖ్యలు వైకాపా నిజ స్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నాయని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ఐదేళ్ల విఫల పాలనలో శాంతిభద్రతలు, అభివృద్ధిపై ఆ పార్టీ వద్ద సమాధానాలు లేవన్న ఆయన.. వారికి బాగా తెలిసిన పద్ధతులైన దూషణలు, బెదిరింపులు, మహిళా ద్వేషం, కులపరమైన దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒక మహిళను, దళిత నాయకురాలిని లక్ష్యంగా చేసుకోవడం అనుకోకుండా జరిగిన ఘటన కాదన్నారు. ఇది వైకాపా ఆధ్వర్యంలో పెంచి పోషించిన విషపూరిత రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని చెప్పారు. అనిత.. కష్టపడే తత్వానికి, ధైర్యానికి, 2లో



## నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం హనుమకొండలో పర్యటించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్(17) అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను మిగతా 2లో

## వితంతువులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం

కొత్తగా 2.20 లక్షల మంది వితంతువులకు పింఛన్లు

ప్రతి నెలా రూ. 4 వేల పింఛన్

మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నామన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతు మహిళలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో త్వరలోనే కొత్తగా 2.20 లక్షల మందికి వితంతు పింఛన్లను మంజూరు చేయనున్నట్లు మిగతా 2లో

## రాబోయే తరాలకు మంచి జరగాలని కోరుకోవడం గొప్పవిషయం: రఘురామ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)



రాబోయే తరాలకు మంచి జరగాలని కోరుకోవడం గొప్ప విషయమని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. దేశవిదేశాల్లో ఉన్నా చదువుకున్న కళాశాల గురించి ఆలోచించడం బాగుందని కొనియాడారు. రంగరాయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న కాకినాడ జీజీహెచ్‌లోని మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి నిర్మాణానికి పూర్వ విద్యార్థులు రూ.60కోట్ల విరాళాలు ఇచ్చారు. బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో దాతలను సన్మానించారు.

ఈ కార్యక్రమానికి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కిమ్స్ వ్యవస్థాపకుడు మిగతా 2లో

# వైకాపా నేతలు ఎంత దూషించినా.. ఆమె గొంతు నొక్కలేరు: లోకేశ్

ప్రజాసేవకు నిదర్శనమని పేర్కొన్నారు. వైకాపా నాయకులు ఎంతగా దూషించినప్పటికీ.. ఆమె సాధించిన విజయాలను తగ్గించలేరని, ఆమె గొంతు నొక్కలేరని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలను పదే పదే తిరస్కరించారన్నారు. అనితతో పాటు ప్రతి మహిళకు, ప్రతి దళితుడికి వైకాపా క్షమాపణ చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు.

# వితంతువులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. అర్హులైన మహిళలకు రాబోయే ఒకటి రెండు నెలల్లో ప్రతి నెలా రూ. 4 వేల చొప్పున పింఛను అందించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ఏపీలో ప్రస్తుతం 62.34 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అని స్పష్టం చేశారు. పింఛను తీసుకునే భర్త చనిపోతే, భార్యకు తక్షణమే 'స్పౌజ్ కేటగిరీ' కింద పెన్షన్ బదిలీ చేస్తున్నామని, దీనివల్ల ఇప్పటికే 2.45 లక్షల మందికి లబ్ధి చేకూరిందని చెప్పారు.పింఛన్ల తొలగింపుపై విపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 9.56 లక్షల పింఛన్లను తొలగిస్తే... తాము కేవలం నిబంధనల ప్రకారమే 7,856 అనర్హుల పింఛన్లను మాత్రమే తొలగించామని, దివ్యాంగులు, రోగుల పింఛన్లను ఎక్కడా రద్దు చేయలేదని మంత్రి తేల్చి చెప్పారు.

# రాబోయే తరాలకు మంచి జరగాలని కోరుకోవడం గొప్పవిషయం: రఘురామ

బొల్లినేని భాస్కరరావు, రంగరాయ మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడారు. ఆస్పత్రి నిర్మాణం కోసం రంగరాయ మెడికల్ కళాశాల పూర్వవిద్యార్థులు రూ.60కోట్లు సేకరించారని.. వారి సేవలను రానున్న తరాలు గుర్తుంచుకుంటాయన్నారు. ఈ కార్యక్రమం మరెంతో మంది పూర్వవిద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు.

## గొడ్డలి పార్టీ బతికితే రాష్ట్రానికి అంధకారమే: మంత్రి అచ్చెన్నాయుడు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 17)**

"గొడ్డలి పార్టీ మళ్లీ పుంజుకుంటే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లడం ఖాయమ"ని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వెన్నుపోటు అనే పదానికి జగనే పేటెంట్ తీసుకున్నారని, దానికి కర్త, కర్మ, క్రియ అన్నీ ఆయనేనని ఎద్దేవా చేశారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని, పదవి కోసం కాంగ్రెస్‌ను, ఆస్తి కోసం కన్నతల్లిని, చెల్లిని సైతం వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దని ఆరోపించారు.

డీఎస్సీ నియామకాల విషయంలో జగన్ తప్పుడు ప్రచారంతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దమ్ము, ధైర్యం ఉంటే మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి డీఎస్సీపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. రొయ్యల మేత ధరలు జగన్ హయాంలో ఎంతలా పెరిగాయో ఆధారాలతో సహా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆయా కంపెనీలకు కులాన్ని ఆపాదించడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు.గతంలో జగన్ ప్రచారం చేసిన అబద్ధాలను సమర్థవంతంగా తిప్పికొట్టలేకపోవడం తమ తప్పేనని అంగీకరించిన అచ్చెన్నాయుడు, ఈసారి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వాస్తవాలు, గణాంకాలతో జగన్ చేసే ప్రతి ఆరోపణను తిప్పికొడతామన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేకనే వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని, తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారనే స్పృహ లేకుండా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్య నిషేధం సహా గతంలో ఇచ్చిన ఏ

## మొదటి పేజీ తరువాయి

ఒక్క హామీని నెరవేర్చని జగన్‌కు, కూటమి మేనిఫెస్టో గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అచ్చెన్నాయుడు తేల్చి చెప్పారు.

# భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ: ట్రంప్ కీలక హామీ

సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు.ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు.

ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది

తెలుసుకున్న పవన్.. ఈ ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

"కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే బాలుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను.అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను" అని పేర్కొన్నారు.

### క్యాంటీన్ పెట్టుకోండి.. సాయం చేస్తా: పవన్ హామీ

ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రుల వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# ఓటమి నాలో కసి పెంచింది.. మంగళగిరి అభివృద్ధిపై లోకేష్ భావోద్వేగం

అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు.2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన తనలో కసి పెంచిందని లోకేష్ గుర్తుచేసుకున్నారు. ఆ కసితోనే ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నానని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజలు తనకు కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, భూగర్భ విద్యుత్ లైన్లు, తాగునీరు, గ్యాస్ పైప్ లైన్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి, పార్కులు, కమ్యూనిటీ భవనాలు, స్మశాన వాటికల అభివృద్ధి వంటి పనులు వేగంగా చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లోకేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పులివెందుల ఎమ్మెల్యే బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి. ఆయన వారంలో మూడు రోజులు బెంగళూరు, ఒకరోజు తాడేపల్లి, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అందుకే ఆయనను 'బెంతహై' (బెంగళూరు, తాడేపల్లి, హైదరాబాద్) అని పిలవాల్సి వస్తోంది" అని ఎద్దేవా చేశారు. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంటుందని, ప్రిజనరీ ఆలోచనలు ఎప్పుడూ జైలు చుట్టూనే తిరుగుతాయని విమర్శించారు. హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన లోకేష్, "గొడ్డలి బ్యాచ్‌కు మహిళలను గౌరవించే సంస్కారం లేదు" అని మండిపడ్డారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేష్ తిప్పికొట్టారు. "జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీ ప్రక్రియను ఆపలేరు. కూటమి ప్రభుత్వం కేవలం 150 రోజుల్లోనే 16 వేల టీచర్ పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టింది. హారిజాంటల్ రిజర్వేషన్ గురించి అవగాహన లేని వైసీపీ నేతలే కోర్టుల్లో 240 కేసులు వేసి అడ్డుకుంటున్నారు. డీఎస్సీపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం" అని సవాల్ విసిరారు. నిడమర్రు ఆర్వోబీని 18 నెలల్లో పూర్తి చేస్తామని, మంగళగిరిని ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని లోకేష్ పునరుద్ఘాటించారు.

# ఎల్‌నినో ప్రభావం..

తాను కూడా స్వయంగా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతులు శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పొగాకు కొనుగోలుదారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అధిక డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడింపు అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆక్వా రైతులు, ఫీడ్ తయారీదారుల సమస్యల పరిష్కారానికి వారితోనూ సమావేశం కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మండలంలో ముమ్మరంగా సర్ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 17)**

మండలంలోని 53వ బూత్ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం మూడో రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి మార్గదర్శకత్వంలో బిఎల్‌వోతో కలిసి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు, సవరణలు, ఇతర వివరాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనారిటీ విభాగం జనరల్ సెక్రటరీ షేక్ జాకీర్ హుస్సేన్ పాల్గొని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు బూత్ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు నమోదు అత్యంత కీలకమని నాయకులు పేర్కొన్నారు.

# అపోలో హాస్పిటల్స్‌కు రూ.17.76 కోట్ల జరిమానా




**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 17)**

విదేశీ మారకపు ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద రూ.2,424.44 కోట్ల ఉల్లంఘనలకు పాల్పడిన అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జరిమానాతో కూడిన మినహాయింపు ఇచ్చింది. ఫెమా చట్టంలోని వివిధ నిబంధనల కింద, ఆ సంస్థ పాల్పడిన ఉల్లంఘనలన్నింటినీ మాఫీ చేసి, (కాంపౌండింగ్) వన్‌టైం పేమెంట్ కింద రూ.17.76 కోట్ల జరిమానా విధించింది. ఆ సంస్థ డైరెక్టర్లు/ఆఫీసర్లు ప్రీతారెడ్డి, సునీతారెడ్డి, ఎస్‌కె వెంకటరామన్, అఖిలేశ్వరన్ కృష్ణన్, ఎస్ఎం కృష్ణన్‌లకు ఒక్కొక్కరికి రూ.18 లక్షల జరిమానా విధించింది. ఈ విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం వెల్లడించింది. 'అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, ఆ సంస్థ డైరెక్టర్లు/ఆఫీసర్లకు సంబంధించిన ఫెమా నిబంధనల ఉల్లంఘన కేసులో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్–1999లోని సెక్షన్ 15 కింద మాఫీ ఉత్తర్వులు జారీ చేసింది. దానివల్ల ఆ చట్టం కింద వారికి వ్యతిరేకంగా చేపట్టిన న్యాయవిచారణ ప్రక్రియ రద్దయిపోతుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) మేరకు, ఆర్‌బీఐ ఈ మాఫీ ఉత్తర్వులు జారీ చేసింద'ని ఈడీ పేర్కొంది. విశ్వసనీయ సమాచారం మేరకు, ఫెమా చట్టంలోని నిబంధనల కింద ఈ కేసులో తాము దర్యాప్తు చేపట్టి.. ఫెమా చట్టంలోని సెక్షన్ 16 కింద అడ్జుడికేటింగ్ అథారిటీ ముందు ఫిర్యాదు దాఖలు చేసినట్లు ఈడీ తెలిపింది. ఫెమా చట్టంలోని సెక్షన్ 15 కింద జరిగిన ఉల్లంఘనల నుంచి మాఫీ కోరుతూ, ఆర్‌బీఐకి అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ దరఖాస్తు చేసుకున్నట్లు ఈడీ వివరించింది. ఆ విషయాన్ని ఆర్‌బీఐ తమకు ప్రతిపాదించగా, చట్ట స్ఫూర్తికి లోబడి ఆ ఉల్లంఘనలకు మాఫీ చేయడానికి అభ్యంతరం లేదని చెప్పామని, దాన్ని పరిగణనలోకి తీసుకుని కింద పేర్కొన్న ఉల్లంఘనలను ఆర్‌బీఐ వన్‌టైం పేమెంట్ కింద మాఫీ చేసిందని వెల్లడించింది.

### ఇవీ ఉల్లంఘనలు

1. ఎఫ్‌డీఐలు నిషేధించిన (రిటెయిలింగ్ ట్రేడ్) రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వీకరించడంతో పాటు, దానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి కూడా తీసుకోలేదు. ఈ ఉల్లంఘనలో రూ.859.87 కోట్లు ఇమిడి ఉన్నాయి.
2. నిబంధనలకు విరుద్ధంగా ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (ఎఫ్‌సీసీబీ) జారీ చేశారు. ఈ ఉల్లంఘన మొత్తం రూ.70.02 కోట్లు.
3. ఎఫ్ఐఐ–పీఐఎస్ రూట్‌లో విదేశీ పెట్టుబడులు స్వీకరించారు. ఇది పెయిడప్ కేపిటల్‌లో 24% పరిమితిని అతిక్రమించడమే. ఈ ఉల్లంఘన విలువ రూ.623.87 కోట్లు.
4. ఈ మొత్తం రంగంపై ఉన్న 51% ఎఫ్‌డీఐ పరిమితినీ మించింది. ఈ ఉల్లంఘన విలువ రూ.870.66 కోట్లు.

ఇప్పుడు ఆర్‌బీఐ వన్‌టైమ్ పేమెంట్ కింద, అపోలో హాస్పిటల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ద్వారా రూ.17.76 కోట్లు, పైన పేర్కొన్న డైరెక్టర్లు/ఆఫీసర్లు ఒక్కొక్కరి నుంచి రూ.18 లక్షల జరిమానా వసూలు చేసి, ఈ ఉల్లంఘనలన్నింటినీ మాఫీచేసింది. తద్వారా కంపెనీకి వ్యతిరేకంగా ఫెమా చట్టంలోని నిబంధనల కింద ప్రారంభించిన న్యాయవిచారణ ప్రక్రియలన్నీ రద్దయిపోతాయని ఈడీ వెల్లడించింది.






# మీనాక్షిరావుకు ఆశీర్వచనాలు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)**

మంచికంటి సునీల్ కుమార్తె కార్తికేయ మీనాక్షి రావు పుష్పాలంకరణ వేడుక పొదిలి పట్టణంలోని శ్రీ వాసవి అమ్మవారిశాలలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు సతీమణి దుర్గా కుమారి, ఆయన కుమారుడు అన్నా కృష్ణ చైతన్య సతీమణి అనూషలు మంచికంటి వారి నివాసానికి వెళ్ళి చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మీనాక్షిరావు తల్లిదండ్రులు మంచికంటి వెంకట బాల సునీల్ కుమార్, వరలక్ష్మి, పెద్దనాన్న, పెద్దమ్మలు మంచికంటి వెంకట బాల సుధీర్‌కుమార్, తిరుపతి వెంకట శ్రావణి, తాతా సత్యం, రవ్వా శ్రీనివాసరావు, దివ్వెల మురళి, సుబ్బారావు (ఎంఆర్‌కె), నారాయణ, తదితరులు చిన్నారికి ఆశీర్వచనాలు అందజేశారు.






ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

18.06.26 గురువారం


# కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలి

## వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది

## జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం,జూన్ 17)

ఎన్నికల ముందు చెప్పిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతుందని ఈ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలను మోసం చేసి అనేక వాగ్దానాలు ఇచ్చారని కానీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేక పోయారని ఏద్దేవ చేశారు . తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు అని వివరించారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన 905 కోట్ల రూపాయలను ప్రభుత్వ విడుదల చేసిందన్నారు. రాయలసీమ మాదిరిగా మార్కాపురం జిల్లాని ఆర్టికల్చర్ హబ్ గా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నా రన్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డును నాలుగు లైన్ల కారిడార్ గా అభివృద్ధి చేయడానికి ప్రధానమంత్రి ఆమోదం తెలిపారని చెప్పారు. రాష్ట్రంలో దేవాలయాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం 16.84 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 116 ఆలయాలకు దీప దూప నైవేద్యాలకు పదివేల రూపాయల చొప్పున 1.10 కోట్ల ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో వెలిగొండ పూర్తి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు జలవన శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి నెల ప్రాజెక్టును సందర్శించడం జరుగుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో భూకబ్జాలు, ఇష్టానుసారంగా ఆన్లైన్లో చేసి జిల్లాను అధోగతి పాలు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాని ప్రకటించారని దీంతో జిల్లా ప్రజల కల నెరవేరిందని తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు పరిశ్రమలను స్థాపించే దిశగా ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారన్నారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం ఐదు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

మార్కాపురం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని వివరించారు. జిల్లా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ జూలై చివరి నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదే విధంగా జల ధార జలహారతి, ఎన్టీఆర్ భరోసా, స్త్రీ శక్తి పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందారని వివరించారు. అంతకుముందు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రత్యేక స్టాల్స్ ను మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మత్తుముల అశోక్ రెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, భాజపా మీడియా అధికార ప్రతినిధి రామచంద్ర రెడ్డి, జిల్లా అధ్యక్షులు కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో వెంకట శివరాం రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)





# నేడే ‘ రెండేళ్ల ’ విజయోత్సవ సభ

### జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహణకు సర్వం సిద్ధం

### ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 17)

రాష్ట్రంలో కూటమి ప్రభత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం మరోసారి ప్రజల్లోకి తీసుకువెళ్లనుంది. ‘ రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం ’ పేరుతో జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. గురువారం ఒంగోలు నగరంలోని ఎస్‌జీవీఎస్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు, శాసన సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఈ రెండేళ్లలో సాధించిన ప్రగతి నివేదికలను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ‘ జలధార – జలహారతి ’ కార్యక్రమాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేస్తూ ఈ విజయోత్సవాన్ని నిర్వహించబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన ప్రారంభమై (తరువాయి 4లో...)

# రాబోయే మూడేళ్లలో కందుకూరుకు మహర్దశ

- బీద రవిచంద్ర యాదవ్
- పోర్టు, కంపెనీల ఏర్పాటుతో వేలమందికి ఉపాధి
- ఎమ్మెల్యే ఇంటూరి పనితీరు సూపర్
- ఇంతమంది అభిమానం చూస్తుంటే అర్థమవుతోంది
- అభివృద్ధి అజెండాగా 2029 ఎన్నికలకు వెళదాం
- వైసీపీ మళ్లీ కుట్రలు చేస్తోంది...
- తిప్పికొట్టాలని కూటమి నేతలకు రవిచంద్ర పిలుపు
- రూ.450 కోట్లతో అభివృద్ధి
- ఇదే నా చిత్తశుద్ధికి నిదర్శనం
- ఎమ్మెల్యే నాగేశ్వరరావు
- బుర్రా ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే
- మర్యాదగా మాట్లాడటం నేర్చుకో...
- లేకుంటే జనం వాతలు పెడతారు
- అవినీతి పురాణం బయట పెడతా, మరోసారి ఓడిస్తా బుర్రాకు సీరియస్ వార్నింగ్
- మాలకొండ రెండు ఘాట్ రోడ్డుకు నెలలోపు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 17)

అబద్ధపు ప్రచారాలు, తప్పుడు ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైసిపి పని. 2024 ఎన్నికలకు ముందు జరిగిన కుట్రలే మళ్లీ చేసేందుకు జగన్ ప్లాన్ వేస్తున్నారు. అందులో భాగంగానే సోషల్ మీడియాలో టిడిపి నేతలపై విషం కక్కుతున్నారు. కూటమి పార్టీల నేతలు అందరూ ఆ దాడులను తిప్పికొట్టాలి. కేవలం అభివృద్ధి అజెండాగా 2029 ఎన్నికలకు వెళ్లి, మళ్లీ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టేలా సమిష్టిగా పని చేయాలి అని ఎమ్మెల్సీ, నెల్లూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు బీద రవిచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కందుకూరులోని ఎస్వీఎస్ కళ్యాణమండపంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేతృత్వంలో విజయోత్సవ సభ బుధవారం జరిగింది. నియోజకవర్గ నలుమూలల నుంచి వేల సంఖ్యలో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. పామూరు రోడ్డు జంక్షన్ నుంచి కళ్యాణ మండపం వరకు జనం కిక్కిరిశారు. కళ్యాణ మండపంలో రెండు హాళ్లు నిండిపోగా, మండపం బయట ఎండ వేడిమిని తట్టుకుని ప్రభుత్వ విజయోత్సవ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీద రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి, ఈసారైనా గెలుస్తామన్న నమ్మకాన్ని వైసిపి నేతలు కోల్పోయారని అన్నారు.

అందుకే ప్రతిరోజు ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు పింక్ డైమండ్, వివేకా హత్య, ఒకే సామాజిక వర్గానికి డిఎస్పీ ప్రమోషన్లు అంటూ అనేక అబద్దాలు చెప్పి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని రవిచంద్ర విమర్శించారు. ఇప్పుడు కూడా డీఎస్పీ పై ఆరోపణలు మొదలుపెట్టారని అన్నారు. చంద్రబాబు డేటా సెంటర్లు, పరిశ్రమలు, ఉద్యోగాలు అని కష్టపడుతుంటే జగన్మోహన్ రెడ్డి మాత్రం విధ్వంసం వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. చంద్రబాబు సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని బీద రవిచంద్ర తెలిపారు. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు పట్టుబట్టి నిధులు సాధిస్తున్నారని అన్నారు. కందుకూరు అభివృద్ధి గురించి ప్రజల్లో సూపర్ రెస్పాన్స్ ఉందని, రాబోయే మూడేళ్లలో ఊహించని స్థాయిలో పనులు జరుగుతాయన్నారు. ఎంపీ వేమిరెడ్డి సహకారంతో గొట్టిపాటి కొండపనాయుడు కెనాల్ పనులు పూర్తి చేసి సోమశిల నుంచి రాళ్లపాడుకు జలాలు తీసుకొచ్చామని తెలిపారు. రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్ కంపెనీల ఏర్పాటుతో కందుకూరు, కావలి నియోజకవర్గాలలో వేల మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయని రవిచంద్ర తెలిపారు. ఓటర్ల జాబితాలకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమంపై నేతలు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

**నేను చేసిన అభివృద్ధి ఇదే**

**ఎమ్మెల్యే ఇంటూరి :** ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ రెండేళ్లలో నియోజకవర్గంలో 450 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టగలిగానని సగర్వంగా ప్రకటించారు. ప్రధానంగా మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు, కొత్తగా సిసి రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణాలు, శివారు ప్రాంతాలకు రామతీర్థం నీటి సరఫరా, మురికి నీటిని వాడుకునీటిగా మార్చి ప్లాంట్, పట్టణంలో (తరువాయి 4లో...)



# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి

## ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 17)

సంతనూతలపాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పేర్నమిట్టలోని లింగారెడ్డి పంక్షన్ హాలులో జరిగిన సంతనూతలపాడు నియోజకవర్గ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమం పై తాము ధైర్యంగా విజయోత్సవ సభలు పెట్టుకుంటున్నట్లు వివరించారు. నాయకుల కంటే ప్రజలు తెలివిగా ఉన్నారనేందుకు నిదర్శనమే వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేయడం అన్నారు. నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో సంతనూతలపాడు నియోజకవర్గాన్ని మిగిలిన నియోజకవర్గాల కంటే ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్ర మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. స్థానిక సంస్థల (తరువాయి 4లో...)



# రాబోయే మూడేళ్లలో కందుకూరుకు మహర్దశ







పార్కులు మరియు కుంటల ఆధునికరణ, ఎంఐజి లేఅవుట్, తదితర పనులకు రూ.110 కోట్లు ఖర్చు చేసామన్నారు. కందుకూరు మండలంలోని గ్రామాలకు రామతీర్థం తాగునీటిని అందించేందుకు రూ.40 కోట్లు, 1800 ఎకరాల గర్భ కండ్రిక భూములకు మోక్షం, 12 ఎకరాల నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీ భూ సమస్యకు పరిష్కారం, రూ.9 కోట్లతో మాలకొండ దేవస్థానం అభివృద్ధి, రూ.11 కోట్లతో చెరువుల అభివృద్ధి, రూ.28 కోట్లతో రామాయపట్నం వద్ద జెట్టి నిర్మాణం, రూ.4 కోట్లతో రాళ్లపాడు రిజర్వాయర్ అభివృద్ధి పనులు, ఇలా చెప్పుకోవడానికి తనకే గర్వంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.10.5 కోట్ల రూపాయలను అత్యధికంగా కందుకూరు నియోజకవర్గానికి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో తల్లికి వందనం పథకానికి రూ.44.61 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.403 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.62 కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.5.16 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా రూ.68 లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారని వెల్లడించారు. ఇక వైసిపి ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ వ్యాఖ్యల పై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయనలాగా సంస్కారహీనంగా మాట్లాడే లక్షణం తనది కాదన్నారు. రాజకీయాలలో హుందాతనంగా మాట్లాడాలని, లేకుంటే ప్రజలు వాతలు పెట్టి కందుకూరు నుంచి తరిమేస్తారని మధుసూదన్ ను ఉద్దేశించి అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎంతోమంది నాయకులు రాజకీయం చేశారు కానీ, బుర్రా లాగా చిల్లర మాటలు మాట్లాడలేదన్నారు. కనిగిరి నియోజకవర్గంలో 2019-24 మధ్య సుమారు 250 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి మధుసూదన్ వెంచర్లు వేశారని ఎమ్మెల్యే విమర్శించారు. తరువాత అవి ప్రభుత్వ భూములని తెలుసుకొని, ప్లాట్లు కొన్నవారు ఇప్పటికీ అల్లాడిపోతున్నారని చెప్పారు. ఆ వ్యవహారంలో తహసీల్దారులు, వీఆర్వోలు సస్పెండ్ అయ్యారని చెప్పారు. ఇలాంటి అవినీతి పనులు మధుసూదన్ ఎన్నో చేశారని, అవన్నీ ఆధారాలతో సహా ఒక్కొక్కటిగా బయటపెడతానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రజల అభిమానంతో రాబోయే ఎన్నికల్లో బుర్రాను ఓడించి, గతంలో కంటే రెట్టింపు మెజారిటీ సాధిస్తానని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ పైకి, రెండవ ఘాట్ నిర్మాణ పనులు త్వరలో మొదలవుతాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రకటించారు. 15 రోజుల్లో టెండర్లు పిలుస్తారని అన్నారు. అలాగే రూ.1.75 కోట్లతో, భక్తులందరూ ఒకేసారి అన్న ప్రసాదం స్వీకరించేలా అధునాతన భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. సభ ప్రారంభానికి ముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళలు, యువకులు అధిక సంఖ్యలో విజయోత్సవ సభకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, జనసేన నాయకులు కళ్యాణ్, నెల్లూరు పార్లమెంట్ కమిటీ నాయకులు షేక్ రూబీ, మద్దసాని మహేంద్ర, దార్ల ఎలమందమ్మ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీ ఈడబ్ల్యుఐడీ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, సీనియర్ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీను, బెజవాడ ప్రసాద్, ??షేక్ రఫీ, షేక్ సలాం, నాదెళ్ళ రమణయ్య, నరేంద్ర, అనుబంధ సంఘాల అధ్యక్షులు కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, అల్లం వెంకటేశ్వర్లు, పొడపాటి మహేష్, షేక్ మున్నా, పూరిమిట్ల మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, మోదడుగు వెంకటేశ్వర్లు, ముచ్చు లక్ష్మీరాజ్యం, జనసేన నాయకులు కొణిదల శ్రీనివాసులు, అంగులూరి నరసింహారావు, గ్రామ మరియు వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి





ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ లోక కల్యాణం కోసం దేవతలు యజ్ఞ యాగాదులు చేస్తే, రాక్షసులు దానిని చెడగొట్టేందుకు ప్రయత్నించారని, ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎన్నికల మెగా డిఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే, దానిని వైసీపీ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. మూడు నాలుగు నెలలకు ఒకసారి వైసీపీ నిద్రలేచి నిరసనల పేరుతో ధ్వంసం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇదే విధంగా వ్యవహరిస్తే ఆ 11 సీట్లు ప్రజలు తీసేయడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ కాక్రోచ్ మాదిరిగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత్ ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధానిగా అత్యధిక కాలం పనిచేసిన వ్యక్తిగా నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారన్నారు. జనసేన సంతనూతలపాడు నియోజకవర్గ ఇంచార్జి కందుకూరి బాబు మాట్లాడుతూ విజయోత్సవ సభలు నిర్వహించాలంటే గట్స్ ఉండాలని, రెండేళ్ల పాలనపై తాము సగర్వంగా చెప్పుకుంటున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో గుంటలమయమైన రోడ్లపై గంపెడు మట్టి వేయలేదని, కూటమి ప్రభుత్వంలో రోడ్లు ఏవిధంగా ఉన్నాయో వివరించారు. ఈ విజయోత్సవ సభలో అడకస్వాములు, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మద్దిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి. యస్.ఆర్) మదంపల్లి శ్రీనివాసరావు, జయంత్ బాబు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 17)**

పొదిలి మండల వైసిపి పార్టీ మాజీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాస్‌రెడ్డి (హనీమూన్ శ్రీనివాసరెడ్డి) వారి అనుచరులతో బుధవారం మార్కాపురం పట్టణంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబు, రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యలు ఆయనకు తెలుగుదేశం పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# నేడే 'రెండేళ్ల' విజయోత్సవ సభ





రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 18వ తేదీన ఒంగోలు నగరంలోని ఎస్‌జివిఎస్ కళ్యాణ మండలంలో నిర్వహించనున్న విజయోత్సవ సభ ముందస్తు ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలు ఒంగోలు నగరంలోని ఎస్‌జివిఎస్ కళ్యాణ మండలంలో ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేజి, సీటింగ్, స్టాల్స్, బందోబస్తు ఏర్పాట్లు ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పటిష్టంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలు విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 23న మార్టూరు తాలుకా ఎపిజిఈఎ ఎన్నికలు

**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 17)**

బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్టూరు తాలుకా ఎన్నికలు జూన్ 23న మార్టూరు ఓల్డ్ పంచాయతీ ఆఫీస్ నందు జరగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా హాట్ హక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జివివి రాఘవరెడ్డి ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలం ముగియటంతో ప్రస్తుతం ఎన్నికలు అనివార్యం అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించామని తెలిపారు. ఈ ఎన్నికల ఎలక్షన్ ఆఫీసర్ గా ఎన్‌పీ పుల్లారావు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా అంజిబాబు వ్యవహరిస్తారని తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్..

21వ తేదీ9 నుండి 11 వరకు నామినేషన్ల స్వీకరణ.11నుండి 12 వరకు నామినేషన్ వెరిఫికేషన్, సాయంత్రం 1 వరకు ఉపసంహరణ. 1 నుండి 2 వరకు పోలింగ్ అదే రోజు కౌంటింగ్ , గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించనున్నారని తెలిపారు. సదరు ఎన్నికల్లో మార్టూరు తాలూకా ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

# కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలి



















# పారిశుధ్య కార్మికులకు సామర్థ్య వృద్ధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 17)

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలెడ్జ్ పార్ట్నర్ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సహకారంతో పొదిలి నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుల కోసం సామర్థ్య వృద్ధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదిలి నగర పంచాయతీ కమిషనర్ యు ఆంజనేయులు, మేనేజర్ ఎస్‌డి షేక్షావలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ మారుతిరావు, మేస్త్రీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ యు ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి కార్మికులు సురక్షిత పద్ధతులను అనుసరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, వ్యర్థాల వేరు వేరు సేకరణ, పారిశుధ్య నిర్వహణలో నాణ్యమైన సేవల అందజేత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఏఐఎల్ఎల్‌ఎస్‌జీ రిసోర్స్ పర్సన్ దత్తం కోటేశ్వరరావు పారిశుధ్య కార్మికులకు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి, పొడి వ్యర్థాల వేరు వేరు సేకరణ, పరిశుభ్రత ప్రమాణాలు, వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పని నైపుణ్యాల పెంపు పై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమ నిర్వహణలో ఏఐఐఎల్‌ఎల్‌ఎస్‌జీ బృంద సభ్యులు నిఖిల్, విశ్వనాథ్, మల్లికార్జున పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు కార్యక్రమం ద్వారా తమ విధుల నిర్వహణలో ఉపయోగపడే విలువైన సమాచారాన్ని పొందినట్లు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా పారిశుధ్య కార్మికుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.





## మర్రిపూడి వెస్ట్ అంగన్వాడి కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే





(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జూన్ 17)

మండల కేంద్రమైన మర్రిపూడి సచివాలయం పరిధిలోని మర్రిపూడి వెస్ట్ అంగన్వాడి కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామని అంగన్వాడి కార్యకర్త కె పి హైమావతి తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించడం జరిగిందన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడి సెంటర్లో ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించి ఆరవ సంవత్సరం వచ్చిన తర్వాత ఎలిమెంటరీ స్కూల్‌కి చేర్చే సమయంలో వీరికి గ్రాడ్యుయేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలు పెరుగుదల, పౌష్టికాహారం మీద శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు అంగన్వాడి కార్యకర్త హైమావతి వివరించారు. అదే విధంగా మూడు సంవత్సరాల నిండిన పిల్లలను అంగన్వాడి కేంద్రంలో చేర్చాలని తల్లిదండ్రులను ఉద్దేశించి హైమావతి కోరారు. చిన్నపిల్లలను గ్రాడ్యుయేషన్ డే డ్రెస్ లో తల్లిదండ్రులు చూసి సంతోషించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలాలయం నిర్మాణం చేయుటకు భూమి పూజ చేసిన ఆలయ కమిటీ





(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూన్ 17)

మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం దేవస్థాన ప్రాంగణంలో బాలాలయం నిర్మాణం చేయుటకు ఆలయ చైర్మన్, కమిటీ వారు, భక్తులు కలసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ మార్నేని వీర రాఘవేంద్రరావు, కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, నారాయణ రాజశేఖరాచార్యులు, యాజ్ఞకులు దీవి శేషాచార్యులు, ఆలయ ఈఓ లీలా కృష్ణ, గుళ్ళాపల్లి శ్రీను, సింగరాజు అరుణ, మర్రిపూడి పద్మావతి, డొక్కా రమ, ఏల్చూరి శేషయ్య, ఇంటూరి అనంతలక్ష్మి, మార్నేని కృష్ణారావు, గాలివెంకట రాంబాబు, నారాయణం వెంకటాచార్యులు, నారిపెద్ది సతీష్ బాబు, మార్నేని చిరంజీవి, చుంచు శ్రీనివాసరావు, మర్రిపూడి వెంకటరావు, ఇంటూరి వెంకటేశ్వర్లు , గాజుల సాంబశివరావు, గాజుల వెంకటరావు, గ్రామ యువత పాల్గొన్నారు.

## ఘనంగా అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 17)

కనిగిరి మున్సిపాలిటీలోని 11వ వార్డు, దేవాంగనగర్‌లో నేషనల్ హెల్త్ మిషన్ గ్రాంట్ కింద రూ.1.18 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కనిగిరి పట్టణంలోని దేవాంగనగర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా ఇంచార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ అర్బన్ హెల్త్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని నాయకులు పేర్కొన్నారు.

## జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య పై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

### కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన ఏపీఈజేయు నాయకులు
### త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 17)

ప్రకాశం జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలలో ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఈజెయు ప్రతినిధులు జిల్లా కలెక్టర్ పి రాజాబాబును కోరారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమస్యపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఏపీఈజేయు అధ్యక్షులు అడ్డగబొట్టు సుబ్బారావు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25% సీట్లను ఉచితంగా భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఆ కోట పరిధిలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన జర్నలిస్టు పిల్లలకు కూడా ఉచిత విద్యను అందించేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ప్రకాశం జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు గతంలో 50% రాయితీని అందించేలా గత కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేలా అక్కడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా జర్నలిస్ట్ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రకాశం జిల్లా ఏపీఈజేయూ ప్రతినిధుల విజ్ఞప్తి పై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య అమలయ్యేలా త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీఈజేయు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి, జిల్లా అధ్యక్షులు ఏ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి మల్లికార్జునరెడ్డి, కోశాధికారి బి సంజీవరావు, బైరపునేని శ్రీనివాసరావు, అంగలుకుర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌కు 10 వీల్‌చైర్‌లు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)
దివ్యాంగులు, జిజిహెచ్‌కు వచ్చే పేషంట్ల సౌకర్యార్థం డిపార్ట్మెంట్ ఆఫ్ డిసైబులిటీ (దివ్యాంగుల సంక్షేమ శాఖ) వారు 10 వీల్ చైర్ లు జిజిహెచ్‌కు బుధవారం అప్పగించారు. ఈ మేరకు సిబ్బంది నుంచి 10 వీల్ చైర్స్ ను జి జి హెచ్ సూపరింటెండెంట్ డా ఎస్ మాణిక్య రావు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అందించిన అత్యంత నాణ్యత కలిగిన చైర్ లు ఇచ్చారని వారి చొరవను అభినందించారు. జి జి హెచ్ కు వచ్చే దివ్యాంగులకు ఇవి ఎంతో ఉపయుక్తం అని అన్నారు. సదరం కోసం వచ్చే వారికి కూడా కేటాయిస్తామన్నారు. ఈ స్వీకరణ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవి లత, ఏఆర్ఎంవో డాక్టర్ సునీల్ గవాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతుల సంక్షేమం కై పంట సాగు హక్కు పత్రం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 17)
కౌలు రైతుల సంక్షేమం, వ్యవసాయ సేవలను సులభతరం చేయుటకు ప్రభుత్వం పంట సాగు హక్కు పత్రము జారీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామేశ్వరం చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో వీఆర్వోలు గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో గ్రామ సభలు నిర్వహించి, కౌలు రైతులకు సీసీఆర్‌సీ యొక్క ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సీసీఆర్‌సీ కలిగి ఉండటం ద్వారా కౌలు రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు మరియు సేవలను పొందేందుకు అర్హత సాధిస్తారని వివరించారు. అలాగే, 2026-27 సంవత్సరంలో కౌలు రైతులు ఎరువుల కొనుగోలు చేయుటకు పంట సాగు హక్కు పత్రము కలిగి ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి కౌలు రైతు సీసీఆర్‌సీ పొందే విధంగా గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, రైతు సమావేశాలు మరియు క్షేత్ర స్థాయి సందర్శనలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు. కౌలు రైతులు తమకు సంబంధించిన భూ యజమానుల అంగీకారంతో అవసరమైన పత్రాలను సమర్పించి పంట సాగు హక్కు పత్రము పొందాలని, దీనివల్ల వ్యవసాయ సేవలు మరియు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని తెలిపారు. అర్హులైన కౌలు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డు పంట సాగు హక్కు పత్రము పొందాలని కోరారు.

## అహ్లాదకరంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 17)
చిన్నగంజాం మండల పరిధిలోని అడివీధిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు ఒకటవ తరగతిలో చేరిన 23 మంది పిల్లలకు మండల విద్యాశాఖ అధికారి బి అజయ్ బాబు, అడివిది పాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత ఆశీర్వాదంతో పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లులు చేతుల మీదుగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఒకటవ తరగతి విద్యార్థులందరికీ పాఠశాల సంసిద్ధత మేళ కార్యక్రమం ద్వారా పాఠశాలలోకి ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి బి అజయ్ బాబు మాట్లాడుతూ పాఠశాలలో చేరిన విద్యార్థులందరూ క్రమం తప్పకుండా ప్రతిరోజు పాఠశాలకు హాజరై తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత మాట్లాడుతూ పిల్లల తల్లులు పిల్లల వర్కుపై ప్రత్యేక శ్రద్ధ వహించి క్రమం తప్పకుండా వారి అభివృద్ధికి తోడ్పడాలని హితవు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిరోజు ఉపాధ్యాయులందరూ ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు గంటన్నర ఎక్కువ సమయము పనిచేసే పిల్లల విద్యాభివృద్ధి కి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వడ్లమూడి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు చుండూరి వెంకటేశ్వర్లు నరహరి చంద్రశేఖర్, ఎర్రవరపు రామాంజనేయులు, సూరే భవాని, కుమారి, సిఆర్‌పి సునీల్, తదితరులు పాల్గొన్నారు.





## మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)
రాజకీయాల్లో విమర్శలు సహజం, కానీ విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని, రూపాన్ని కించపరచడం దుర్మార్గం. హోంమంత్రి, ఒక దళిత మహిళ అయిన వంగలపూడి అనిత మేకప్‌ను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు. దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, హుందాగా కనిపిస్తే వైసీపీకి ఎందుకు అంత అసహన ఒంగోలు నగర టీడీపీ మహిళా నాయకులు ప్రశ్నిహించారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయం నందు ఒంగోలు నగర మహిళా టీడీపీ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో మహిళా ప్రజాప్రతినిధులపై, అమరావతి మహిళలపై దాడులు జరిగినా నాటి సీఎం జగన్‌రెడ్డి మౌనం వహించారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో 'జీరో టాలరెన్స్' విధానం అమలవుతోంది. తప్పు చేసిన వారు సొంత పార్టీ వారైనా (ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, చేబ్రోలు కిరణ్) ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడు ది అని మహిళా నాయకులు తెలిపారు. మహిళల రక్షణ కోసం "శక్తి యాప్", ప్రత్యేక సైబర్ నిఘా, వన్ స్టాప్ సెంటర్లతో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుడివాడ అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఒంగోలు టీడీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు.

## కష్టమ్ హైరింగ్ సెంటర్ శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 17)
రైతుల అభ్యున్నతి వ్యవసాయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని మండల టిడిపి అధ్యక్షుడు పోద వీరయ్య అన్నారు. బుధవారం వెలుగు డిఆర్డిఏ ఆధ్వర్యంలో మహిళా రైతులు పర్యవేక్షణలో కష్టమ్ హైరింగ్ సెంటర్ కి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పోద వీరయ్య చౌదరి, మండల తహశీల్దార్ జె ప్రభాకరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ సెంటర్ అనేది మన మండలంలో రైతులకు ఎంతో బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సెంటర్లో రైతులకు తక్కువ ధరకు అద్దెకు పనిముట్లను ఇవ్వటం జరుగుతుందన్నారు. దీనిని చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి యర్లగడ్డ లక్ష్మీ, ఎపిఎమ్ జి పెదసుబ్బరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శారదమ్మ, ఎఫ్ఈఓ అధ్యక్షులు అంజనాదేవి, పార్లమెంటు అధికార ప్రతినిధి అజాద్, తుమ్మలపెంట జయరాజు, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్, మహిళా రైతులు, సీసీలు పాల్గొన్నారు.

## వంగపాడులో అంగన్‌వాడీ పిలుస్తోంది





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 17)
కనిగిరి మహిళా ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "అంగన్వాడీ పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా కనిగిరి మండలం వంగపాడు అంగన్వాడీ కేంద్రము నందు ప్రీ స్కూల్లో చేరిన చిన్నారులకు "అక్షరాభ్యాసం" కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం వి ఎస్ పార్వతి చిన్నారులకు తల్లుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించిరి. తదుపరి ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే జరిపి సర్టిఫికెట్లను పంపిణీ చేసి, వారిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించడ మైనది. తల్లిదండ్రులతోపార్వతి మాట్లాడుతూ మూడు సంవత్సరములు నిండిన చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలని, ప్రీస్కూల్ విద్య, పౌష్టికాహారం ,ఆరోగ్య సేవలను అందించే అంగన్వాడీలను గురించి అవగాహన కలిగించడమైనది. అనంతరం గ్రామంలో అంగన్వాడీ పిలుస్తుంది అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ తిరుపతి, జి కేశవ కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు విజయ కుమారి, శైలజ, రాధ, రాజేశ్వరి, గ్రామంలో తల్లిదండ్రులు, కిశోర బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.



## ఓటర్ వెరిఫికేషన్ ఫారాలు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)
సర్ ఓటర్ జాబితా వెరిఫికేషన్ కార్యక్రమం ప్రకారం బుధవారం 15వ డివిజన్ 166, 170, 171, 172వ బూత్‌లలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆదేశాల ప్రకారం బూత్ బిఎల్ఓతో కలిసి వెరిఫికేషన్ ఫారాలను ఓటర్ల ఇంటి దగ్గరికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డం ఆదినారాయణ, 170వ బూత్ కన్వీనర్ బిఎల్‌ఏ లక్కవరపు అరుణ , 171వ బూత్ బిఎల్‌ఏ మువ్వల పోతురాజు, 172వ బూత్ బిఎల్‌ఏ గంజిరపల్లి జగదీష్, టీడీపీ పార్టీ నగర కమిటీ సభ్యులు యాలటూరి రవి, టీడీపీ నాయకులు మద్రిపూడి శ్రీను, సుహాసిని, పాల్గొన్నారు.



# మహిళలు మృతి చెందటానికి కారణమైన వారి పై కేసు నమోదు చేయాలి

## గిరిజన ప్రజాసామాఖ్య జిల్లా అధ్యక్షులు రామావత్ సైదా నాయక్ డిమాండ్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

దళిత, గిరిజనులకు సంబంధించిన మహిళలు మృతి చెందటానికి కారణమైన కారు యజమానిని అరెస్టు చేసి అతని పై ఎస్సీ, ఎస్టీ త్రీ నాట్ సెవెన్ కింద కేసు నమోదు చేయాలి అని గిరిజన ప్రజాసామాఖ్య జిల్లా అధ్యక్షులు రామావత్ సైదా నాయక్ డిమాండ్ చేశారు. ఒంగోలు రిమ్స్ వద్ద మృతి చెందిన మహిళల బంధువులు గిరిజన దళిత సంఘాల ఆధ్వర్యంలో రిమ్స్ ముందు 4:30 నుండి 7 వరకు రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మంగమూరు డొంక వర్మ గ్రాండ్ లో కార్మికులుగా పని చేస్తూ మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్ళేటప్పుడు మద్యం సేవించి బీజాకారు గుద్ది ఇద్దరు చావుకి కారణమయ్యారని అతనిని వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రజా ప్రతినిధులు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే న్యాయం చేయాలని వారు కోరారు. మంగళవారం జరిగిన ఘటనకు సంబంధించి ఇంతవరకు ప్రమాదానికి కారణమైనటువంటి వ్యక్తులు బాధితులను పరామర్శించకపోవడం శోచనీయమని వెంటనే బాధ్యత కుటుంబాలను పరామర్శించాలని కోరారు. రాస్తారోకోతో ట్రంక్ రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ పూర్తిగా అంతరాయం ఏర్పడింది పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఇంకా మృతదేహాలకు పోస్టుమార్టం కాలేదు గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

# మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేత తుమ్మిశెట్టి సునీల్



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 17)

బద్వేల్ పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ యువ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ తుమ్మిశెట్టి సునీల్ బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మిశెట్టి సునీల్ తన వివాహ మహోత్సవ ఆహ్వాన పత్రికను వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అందజేసి, పెళ్ళికి రావాల్సిందిగా సాదరంగా ఆహ్వానించారు. సునీల్ ఆహ్వానాన్ని స్వీకరించిన మాజీ ముఖ్యమంత్రి, ఆయనకు ముందస్తు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ ఆహ్వానం అనంతరం, బద్వేల్ నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు మరియు స్థానిక ప్రజా సమస్యలను తుమ్మిశెట్టి సునీల్ కుమార్ మాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన జగన్మోహన్ రెడ్డి, స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సునీల్‌కు దిశా నిర్దేశం చేశారు.

# త్వరలో పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పూర్తి

## బద్వేల్ ఏఎంసి చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 27)

వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లోని రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా ఒక కీలక అడుగు పడింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను మర్యాదపూర్వకంగా కలిసి, ప్రాంతీయ మార్కెట్ యార్డుల అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు.

**ఉప మార్కెట్ యార్డ్ పూర్తి :**

ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి, స్థానిక రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జేడీని కోరారు.

**రైతు బజార్ల నిర్వహణ :**

పోరుమామిళ్లలో కొత్తగా రైతు బజార్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు.

**ఆదాయ వనరుల పెంపు :**

బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం ద్వారా కమిటీ ఆదాయాన్ని పెంచవచ్చని, అదే సమయంలో రైతులు, వ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించవచ్చని ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా బద్వేల్, పోరుమామిళ్ల పరిధిలో ఈ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఈ సమావేశంలో అధికారులు, కమిటీ ప్రతినిధులు ఒక నిర్ణయానికి వచ్చారు.

# ఉచిత మందుల పంపిణీ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

అమ్మా నాన్న సేవా సంస్థ అద్వర్యంలో బుధవారం పులివెంకటరెడ్డి కాలనీలోని యేసయ్య ఆదరణ ప్రార్థన సహవాసము నందు లెప్రసి రోగులకు అమ్మ నాన్న సేవాసంస్థ అధ్యక్షుడు ఎన్ ఎమ్ సుభాని ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పాల్ ప్రసాద్, కొప్పోలు శరణ్య, లెప్రసి రోగులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. లెప్రసి రోగులు చాలా ఆనందం వ్యక్తం చేసారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని మనస్ఫూర్తిగా కోరారు.

# కోదండరామస్వామి విగ్ర ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలి

## నేటి నుండి మూడు రోజులు వరకు వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూన్ 17)



బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్ జాంబవంత నగర్ లోని కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నేటి నుండి గురువారం, శుక్రవారం, శనివారం మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ పునర్నాణం కమిటీ సభ్యులు వల్లంకొండు వెంకటరమణ, కె వి సుబ్బారావు, రామకోటి రాజు, పెద్ది సుధాకర్, సి, వి నాగేశ్వరరావు, పబ్బతి చంద్రశేఖర్, ఈగ సుబ్బారెడ్డి, బ్రహ్మదేవుని యర్రం రెడ్డి, భత్తల సునీల్ కుమార్, వీర కామేశ్వరరావు కాలువ నాగేంద్ర, హరి, శ్రీనివాసులు, రమేష్,మరియు పలువురు కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని పలువురు దాతల సహాయ సహకారాలతో గత 15 సంవత్సరాలుగా కోదండ రామాలయం నిర్మాణం పూర్తిస్థాయిలో ఆగిపోవడంతో అక్కడ ఆలయ పుణ నిర్మాణం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. గురువారం నుండి శనివారం వరకు మూడు రోజులు పాటు వేద పండితులు సత్యనారాయణ శర్మ బృందం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కావున బద్వేల్ పట్టణ పరిసర ప్రాంత ప్రజలు భక్తులు విరివిరిగా పాల్గొని స్వామివారి విగ్ర ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలువురికి ఆహ్వానం పలికారు. ముఖ్యంగా శనివారం తెల్లవారుజామున స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, అనంతరం అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కార్యక్రమాన్ని కనుల పండగగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం సాయంత్రం పురవీధులలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇవనున్నారు. స్వామివారి మెరమని వెంబడి నంది అవార్డు గ్రహీత వెంకీ మాస్టర్ కోలాట బృందం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆలయ పున నిర్మాణానికి సహకరించిన దాతలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఈ ఉత్సవాలలో హిందూ బంధువులు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.




# మరో దివ్య తిరుమల గిరి శ్రీగిరి

**ఆలూరు వెంకటరమణారావు**
**తపః ఫలం శ్రీగిరి ఆలయం**
**1971లో ఆలయ నిర్మాణానికీ సన్నాహాలు**
**1997లో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠాపన**
**జూన్ 22 నుండి 25 వరకు శ్రీగిరి బ్రహ్మోత్సవాలు**
**26న శ్రీవారి కళ్యాణం**










(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 17)

మరో దివ్య తిరుమలగా పేరొందిన ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని నిర్మించి ఆ స్వామివారిని భక్తులు నిత్యమూ సేవించి తరించే మహద్భాగ్యాన్ని ప్రసాదించిన ఘనత కీర్తి ఖ్యాతి శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ప్రముఖ పారిశ్రామికవేత్త నీరజ గ్రూపు కంపెనీల అధినేత వేద విద్యా ప్రవర్ధక జ్యోతిష విజ్ఞాన శాస్త్రవేత్త వితరణశీలి ఆలూరు వెంకట రమణా రావుకు దక్కుతుంది. కుర్తాళం పూర్వ పీఠాధిపతి శ్రీ శివ చిదానంద భారతీ స్వామి, కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి..పెద్ద గంజాం సిద్ధాంతిగా పేరొందిన వేమూరి వెంకట నృసింహ శాస్త్రి ప్రభృతుల ఆశీస్సులు..కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ఆలూరు వెంకట రమణారావు జీవితం ఒక గొప్ప మేలి మలుపు తిరిగింది. ఒంగోలు కొండపై తనకు ఒక ఆలయాన్ని నిర్మించవలసిందిగా వెంకటేశ్వర స్వామి వారు ఆదేశించడంతో స్వామివారి ప్రత్యక్ష ఆదేశాన్ని అనుసరించి ఆలూరు వెంకట రమణా రావు 1971లో ఒంగోలు కొండపై శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి 1997 లో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి గర్భాలయంలో శ్రీవారి అర్చావతార మూర్తిని ప్రతిష్టించారు. శ్రీవారి మూల విరాట్ తయారీకి కృష్ణ కంచి శిల్పాన్ని ఉపయోగించారు. నాగేశ్వర స్థపతి శ్రీవారి విగ్రహాన్ని దివ్యత్వం దైవత్వం ఉట్టిపడేలా అద్భుతంగా తీర్చిదిద్దారు. శ్రీవారి విగ్రహం తయారీకి ఉపయోగించిన కృష్ణ శిలను తడితే ఓంకార ధ్వని వినబడడం విశేషం. తిరుమలలో అర్చకులు శ్రీవారి సేవలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. అలాగే శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కూడా వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారమే శ్రీవారి నిత్య సేవలు మాస సేవలు పవిత్ర ఉత్సవాలు బ్రహ్మోత్సవాలు వంటివి నిర్వహించేలా ఆలూరు వెంకట రమణారావు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసారు. నేటికి ఆలయ నిర్వాహకులు ఆ పద్ధతులనే అనుసరిస్తున్నారు. శ్రీ గిరి దేవస్థానానికి అనుబంధంగా గో శాలను నిర్వహిస్తున్నారు. పుంగనూరు.. గిరి జాతి ఆవులను గో శాలలో పోషిస్తూ నిత్య గో పూజ నిర్వహిస్తున్నారు. గోశాల నుండి సేకరించిన పాలను వెంకటేశ్వర స్వామి వారి పూజా కార్యక్రమాలలో వినియోగిస్తున్నారు.



**ఒంగోలు శ్రీగిరి పై శ్రీవారికి ఆలయం నిర్మించి ఆలూరు వెంకట రమణారావు**

తన జన్మను చరితార్థం సార్థకం చేసుకున్నారు. శ్రీగిరి ధర్మ ప్రచార పరిషత్ ద్వారా నృత్య సంగీత సాహిత్య ఆధ్యాత్మిక కార్యక్రమాల సాంస్కృతిక కేంద్రంగా మరో దివ్య తిరుమలగా శ్రీగిరిని తీర్చి దిద్దారు. తిరుమలలో ఆనంద నిలయంలో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ముమ్మూర్తులా పోలి ఉండే విధంగా శ్రీగిరి ఆలయంలో శ్రీవారి అర్చావతార మూర్తిని ప్రతిష్టించడంతో శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించే పలువురు భక్తులు సాక్షాత్తూ తిరుమలలో శ్రీవారిని దర్శించిన అనుభూతిని భక్తి పారవశ్యాన్ని పొందుతుంటారు. కారణాంతరాల వల్ల తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకోలేని పలువురు భక్తులు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి తమ మొక్కులు చెల్లించుకోవడం కూడా రివాజు. ఆలూరు వెంకట రమణారావు శ్రీగిరి దేవస్థానం పక్షాన సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. శ్రీగిరి విద్యానిధి పేరిట పలువురు విద్యార్థుల చదువు నిర్విఘ్నంగా పూర్తి అయ్యేలా తోడ్పాటును అందించారు. శ్రీగిరి వైద్య నిధి పథకం ద్వారా పలువురికి వైద్య సహాయం అందించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ధార్మిక చైతన్య సాధనకు కృషి చేసారు. తన జీవితాన్ని ధనాన్ని తపస్సును సర్వస్వాన్ని శ్రీవారి సేవకు వెచ్చించి ఆలూరు వెంకట రమణారావు ఆ స్వామి వారిలో ఐక్యమైనారు. ఆలూరు వెంకట రమణారావు సంకల్పించిన ధార్మిక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన కుటుంబ సభ్యులు అంతే నిష్ఠతో కొనసాగిస్తుండడం అభినందనీయం. ఆలూరు వెంకట రమణారావు అందించిన ధార్మిక ఆధ్యాత్మిక సామాజిక సేవలను సదా స్మరించుకోవాలనే సదాశయంతో శ్రీగిరిలో ఏర్పాటు చేసిన ఆలూరు వెంకట రమణా రావు కాంస్య విగ్రహం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను ముకుళిత హస్తాలతో ఆత్మీయంగా స్వాగతిస్తూ పరమాత్ముని సేవలో జీవితాన్ని పునీతం చేసుకోవలసినదిగా భక్తకోటికి ప్రబోధిస్తున్నట్లుగా దర్శనమిస్తుంది. ఆలూరు వెంకట రమణారావు తపఃఫలితమే మరో దివ్య తిరుమలగా వెలుగొందుతున్న శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం.

**జూన్ 22 నుండి 25 వరకు శ్రీగిరి బ్రహ్మోత్సవాలు :**

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 22 సోమవారం నుండి 25 వ తేదీ గురువారం వరకు త్రయాహ్నిక దీక్షతో శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార ఆత్రేయ వెల్లడించారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వరానంద భారతీ స్వామి, ఉత్తర పీఠాధిపతి శ్రీ దత్తేశ్వరానంద భారతీ స్వామి వారల దివ్య ఆశీస్సులతో ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరుగుతాయని పేర్కొన్నారు.

**కార్యక్రమాల వివరాలు :**

22వ తేదీ సోమ వారం సాయంత్రం శ్రీగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. విష్వక్సేన పూజ, మేదినీ పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజదండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ జరుగుతాయి. 23వ తేదీ మంగళ వారం ఉదయం రక్షాబంధనం, భేరీ పూజ, ధ్వజారోహణం, విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం కుంభపూజ, బలిహోమం, 7 గంటలకు శ్రీవారికి హనుమంత వాహన సేవ సందర్భంగా పొన్నూరు వెంకట శ్రీనివాసులుచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయి.

24వ తేదీ బుధవారం ఉదయం యాగశాల పూజలు, శ్రీవారి ఉత్సవమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.30 లకు శ్రీవారికి ఊంజల సేవ, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్ చే గాత్ర కచేరీ, శ్రీవారికి ఏకాంత సేవ జరుగుతాయి. 25వ తేదీ గురువారం ఉదయం యాగశాల పూజలు, చూర్ణోత్సవం, విశేష స్నపన తిరు మంజనం, చక్ర స్నానం, సాయంత్రం ధ్వజ అవరోహణ, పూర్ణాహుతి నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారికి శేష వాహన సేవ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షకురాలు మంగళంపల్లి అలేఖ్య ప్రభ ఆధ్వర్యంలో హైదరాబాద్ కు చెందిన రింద శరణ్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుంది. 26వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారి తిరు వీధి ఉత్సవం, స్వర్ణ సుబ్బారావు బృందం చే కోలాట ప్రదర్శన జరుగుతాయి. బ్రహ్మాండ నాయకుడైన శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలలో పాలుపంచుకోదలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు.



## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న నాయకులు

(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 17)

కంభం మండల పరిధిలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం మూడవ రోజు కూడా విజయవంతంగా కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా 54వ పోలింగ్ బూత్ వద్ద బిఎల్ఓ కరిముల్లాతో కలిసి మాజీ ఎంపీటీసీ సభ్యులు సయ్యద్ అనీస్ అహ్మద్, బీఎల్ఏ అత్తర్ షేక్ హుస్సేన్ (దాదా), షేక్ ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాను సక్రమంగా ఉంచుకోవడం అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక వాతావరణంలో అలరించిన యోగాంధ్ర



(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 17)

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కోట సత్యమాంబ దేవి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన యోగా కార్యక్రమం ఆరోగ్య, ఆధ్యాత్మిక, ప్రకృతి సోయగాల సమ్మేళనంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని పచ్చని చెట్లు, పక్షుల కిలకిలారావాలు, భక్తి భావాలను మేల్కొలిపే ఆధ్యాత్మిక ప్రతిధ్వనులతో సాగిన యోగా సాధన, పాల్గొన్న వారిలో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. ఎంపీడీవో వీరబ్రాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా గురువు, పీడి సంపంగి సుబ్రమణ్యం పలు యోగా ఆసనాలు, ప్రాణాయామ విధానాలను ప్రదర్శించి చేయించారు.



ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరభద్రాచారి మాట్లాడుతూ, యోగా కేవలం శరీరానికి వ్యాయామం మాత్రమే కాదాని, మనసుకు ప్రశాంతతను,ఆనందాన్ని అందించే సాధన అన్నారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాకు స్థానం కల్పించాలని చెప్పారు. ఆలయ ఆవరణలో, ఆధ్యాత్మిక ప్రకంపనల నడుమ ప్రకృతి ఒడిలో సాగిన ఈ యోగా కార్యక్రమం శరీరానికి చైతన్యాన్ని, మనసుకు ప్రశాంతతను అందిస్తూ పాల్గొన్న వారికి మరపురాని అనుభూతిని మిగిల్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపి చేగిరెడ్డి తులసమ్మ, నాయకులు కొత్తపల్లి. శ్రీనివాసులు, ఓబుల్ రెడ్డి, ఎంఈవో అబ్దుల్ సత్తార్, అన్ని శాఖల,అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com